సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: హైదరాబాద్‌కు చెందిన పసుపులేటి సుజాత, ఆమె మిత్రులు స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం రూ.లక్ష విరాళం చెక్కును అందజేశారు.



అన్నదాన భవనానికి విరాళాలు

కొత్తపేట: వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి ఊబలంకకు చెందిన మేడపాటి వెంకటసత్యనారాయణరెడ్డి, శ్రీవన్‌విరాజ్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళంగా సమర్పించారు.

ప్రాణం మీదకు తెచ్చిన ప్రచార పిచ్చి



అధికార పార్టీ ప్రచార పిచ్చి ప్రయాణికులకు ప్రాణాంతకంగా మారింది. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు ప్రయాణికుల పాలిట శాపంగా మారుతున్నాయి. బిక్కవోలు గ్రామానికి చెందిన గువ్వల విజయలక్ష్మి, వెంకటరెడ్డి దంపతులపై బుధవారం ఫ్లెక్సీ పడి గాయాలపాలయ్యారు. -IIలో

న్యూస్‌రీల్

నేడు యూటీఎఫ్ రణభేరి



బైక్ ర్యాలీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

రాయవరం: సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు రణభేరి పేరుతో మోటార్ సైకిల్ జాతా నిర్వహించారు. యాప్‌ల పని భారం తగ్గించాలని, బోధనేతర పనులు వద్దని కోరుతూ, అలాగే వారి ఆర్థిక సమస్యల నేపథ్యంలో గురువారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సదస్సుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు తరలి వెళ్తున్నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా యూటీఎఫ్ శాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, సుబ్బారావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అహోరాత్ర లలితా పారాయణ



అహోరాత్ర లలితా సహస్ర నామ పారాయణలో పాల్గొన్న భక్తులు

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో తృతీయ అహోరాత్ర లలితా సహస్ర నామ పారాయణ అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా లలితా భక్త మండలి ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున ఐదు గంటలకు మొదలైన ఈ పారాయణ మరుసటి రోజు ఉదయం ఐదు గంటల వరకు కొనసాగనుంది. ఆలయ అర్చకులు, పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ సహాయ కమిషనర్, ఈవో వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వంతెన పనులు పరిశీలించిన ఏఐఐబీ బృందం



ఊడిమూడిలంక వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రతినిధుల బృందం

పి.గన్నవరం: ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల రాకపోకల కోసం వశిష్ఠ నదిపాయపై రూ.71.42 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన పనులను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) ప్రతినిధుల బృందం బుధవారం పరిశీలించింది. వరదల సీజన్‌లో ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లో పడవలపై రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో వంతెన నిర్మాణ పనులను అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన విషయం విదితమే. ప్రస్తుత ప్రభుత్వం ఇటీవల రూ.21 కోట్లు విడుదల చేసింది. వంతెన నిర్మాణ పనులను ఏఐఐబీ ప్రతినిధుల బృందం ప్రతినిధి పవన్ కార్కి, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, సోషియల్ ఎక్స్‌పర్ట్ శివరామకృష్ణ, ఏవీఎస్ శ్రీనివాస్, పీఆర్ ప్రాజెక్టు విభాగం ఎస్ఈ ఏవీఎస్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో వారు చర్చించారు. ఇంత వరకూ 60 శాతం మేర పనులు జరిగినట్టు కాంట్రాక్టు సంస్థ అధినేత పీపీ రాజు, పీఆర్ డీఈఈ అన్యం రాంబాబు ఆ బృందానికి వివరించారు. ఇప్పటి వరకూ జరిగిన పనులపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఫినిషింగ్ పనులు పూర్తి కాకపోయినా, వచ్చే వరదల సీజన్ నాటికి ప్రజలు వంతెనపై నడచి వెళ్లేలా అవకాశం కల్పించాలని కార్కి సూచించారు. ఈ సందర్భంగా ఏఐఐబీ ప్రాజెక్ట్ మేనేజర్ పీవీ రమణమూర్తి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏఐఐబీ ద్వారా రూ.3,520 కోట్లతో 4 వేల కిలోమీటర్ల మేర రోడ్లు, ఆరు హై లెవెల్ వంతెనలు నిర్మిస్తున్నట్టు చెప్పారు. మూడు వంతెనలు 50 శాతం మేర, మరో మూడు వంతెనలు 25 శాతం మేర పనులు పూర్తయ్యాయని వివరించారు. ఈఈ పులి రామకృష్ణారెడ్డి, ఏఈఈ పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం పీక్



రాజమహేంద్రవరంలో బస వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు బారులు తీరిన ఎంపికైన అభ్యర్థులు



రాజమహేంద్రవరం లాలాచెరువు నగరపాలక సంస్థ పాఠశాలలో ఎంపికైన డీఎస్సీ అభ్యర్థులతో మాట్లాడుతున్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

- నేడు అమరావతిలో డీఎస్సీ నియామకపత్రాల అందజేత
- ఆర్డర్లకు అభ్యర్థులు 250 కిలోమీటర్లు వెళ్లాల్సిందే..
- రాజమహేంద్రవరంలో రాత్రి బస
- అక్కడి నుంచి అమరావతికి ప్రయాణం
- మండిపడుతున్న ఎంపికైన ఉపాధ్యాయులు
- గతంలో ఎన్నడూ లేని విధానం

సాక్షి, అమలాపురం: పావలా కోడికి ముప్పావలా మషాలా అన్నట్టుగా ఉంది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ తీరు. చేసేది తక్కువ.. చెప్పేది ఎక్కువ అన్నట్టుగా సాగుతోంది. పుష్కరాలైనా.. ప్రభుత్వ కార్యక్రమం ఏదైనా ఈవెంట్ మేనేజ్‌మెంట్ తరహాలో జనాన్ని తరలించుకువచ్చి మీడియాలో హైప్ సృష్టించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వెన్నతో పెట్టిన విద్య. దీనిలో భాగంగానే తాజా డీఎస్సీలో కష్టపడి ఉద్యోగాలు పొందిన వారికి ఆర్డర్లు ఇవ్వడం కూడా ఈవెంట్‌గా మార్చేస్తున్నారు చంద్రబాబు. కొత్తగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను ఇది వ్యయప్రయాసలకు గురి చేస్తోంది.

మెగా డీఎస్సీ-2025 పేరుతో కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటానికి తెర తీసింది. డీఎస్సీ నోటిఫికేషన్ మొదలు.. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేయడం వరకూ ప్రతి విషయంలోనూ హంగూ ఆర్భాటానికి పెద్దపీట వేస్తోంది. చిన్న పని చేసినా విపరీత ప్రచారం కల్పించుకోవడం సీఎం చంద్రబాబు కోరుకుంటారనేది బహిరంగ రహస్యమే. ఇప్పుడు 150 రోజుల పాటు కసరత్తు జరిపి నానా హంగామా చేసిన డీఎస్సీ విషయంలోనూ అదే తీరును కనబరుస్తున్నారు.

ఫోన్లలో సందేశాలు

తొలుత ఈ నెల 19న విజయవాడ వేదికగా నియామక పత్రాల పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. వాతావరణం అనుకూలంగా లేదని దానిని వాయిదా వేశారు. తిరిగి ఈ నెల 25న అమరావతి రావాలంటూ ఫోన్ల ద్వారా అభ్యర్థులకు సమాచారం అందిస్తున్నారు. డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వారికి నియామకపత్రాలు పంపిణీ చేస్తామంటూ హంగామా సృష్టిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి అమరావతికి రావాలని విద్యా శాఖ కార్యాలయం నుంచి ఫోన్ సందేశాలు ఎంపికైన అభ్యర్థులకు వస్తున్నాయి. అభ్యర్థితో పాటు ఓ సహాయకుడిని కూడా తీసుకురావాలంటూ ఫోన్‌లో సమాచారం అందిస్తున్నారు. దీనిపై ఎంపికైన అభ్యర్థులు మండిపడుతున్నారు. వ్యయప్రయాసలకు లోనై అక్కడికి వెళ్లాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

3,500 మందికి ఏర్పాట్లు


ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,349 మంది టీచర్లు ఎంపికైనట్టు ప్రకటించారు. జోన్-2 నుంచి టీజీటీ, పీజీటీకి ఎంపికైన 194 మంది ఉపాధ్యాయులనూ జిల్లా నుంచే సన్నద్ధం చేస్తున్నారు. ఈ నెల 15న డీఎస్సీ తుది ఎంపిక జాబితాను ప్రచురించారు. నియామకపత్రాల పంపిణీని కూటమి ప్రభుత్వం రాజకీయ ప్రచారంగా మలచుకుంటోంది. ఈ ప్రక్రియను రాష్ట్ర స్థాయిలో అమరావతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపికైన అభ్యర్థులతో పాటు, వారి కుటుంబ సభ్యుల్లో ఒకరు కూడా రావాలని విద్యా శాఖ అధికారులు సందేశాలు పంపారు.

సుదీర్ఘ ప్రయాణం

ఉమ్మడి జిల్లా నుంచి అమరావతి వెళ్లేందుకు అభ్యర్థులు కనీసం 250 కిలోమీటర్ల నుంచి 300 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంది. వీరిలో మహిళలు, గర్భిణులు, చిన్న పిల్లలతో ఉన్నవారున్నారు. వీరంతా ప్రయాసలకోర్చి నియామక ఉత్తర్వులు అందుకోవడానికి వెళ్లాల్సిందే. అలా కాకుండా ప్రతి జిల్లాలో కార్యక్రమం పెట్టి.. నియామక పత్రాలు ఇచ్చి ఉంటే బాగుండేదని పలువురు వాపోతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 1,543 మంది అభ్యర్థులు, వారితో పాటు మరో 1,543 మంది సహాయకులు వెళ్లాల్సి ఉంది. వీరికి 288 మంది ఉపాధ్యాయులను ఎస్కార్టుగా నియమించారు. పది మంది వైద్య సిబ్బంది, 12 మంది విద్యా శాఖ ఉన్నతాధికారులు కలిపి మొత్తం 3,528 మంది వరకు వెళ్లనున్నారు. మొత్తం 72 బస్సులను ఏర్పాటు చేశారు. డ్యూటీలు పడిన వారికీ ఈ వ్యవహారం తలనొప్పిగా మారింది. ఉన్నతాధికారుల ఆదేశాలు కావడంతో లోపల నొచ్చుకుంటూనే బయటకు చిరునవ్వులు చిందిస్తూ వెళ్లాల్సిన పరిస్థితి. పైగా నేరుగా వెళ్లేందుకు వీల్లేకుండా, అందరినీ బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరం రావాల్సిందిగా నిర్దేశించారు. వీరందరికీ స్థానికంగా శ్రీచైతన్య, బీవీఎం ఉన్నత పాఠశాల, లాలాచెరువు మున్సిపల్ హైస్కూల్, సత్యసాయి గురుకులం, సెయింటాన్స్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం (బొమ్మూరు)లో తాత్కాలిక వసతి ఏర్పాటు చేశారు. వీరు గురువారం ఉదయం బయలుదేరి అమరావతి వెళ్లాల్సి ఉంది.

ముందెన్నడూ లేదు

డీఎస్సీ నియామకాల సమయంలో గతంలో ఎప్పుడూ ఈస్థాయి ప్రచారం చేసుకున్న ఘనత మరే ప్రభుత్వానికీ, మరే ముఖ్యమంత్రికీ దక్కలేదు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 2008 మెగా డీఎస్సీ ప్రకటించారు. ఏకంగా 52,655 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. తర్వాత ఎన్నికలు రావడం, వైఎస్సార్ రెండోసారి సీఎం అయినా హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. తర్వాత సీఎం అయిన రోశయ్య కాలంలో ఈ పోస్టులు భర్తీ అయ్యాయి. మెరిట్ లిస్టు ప్రకటించడం, తర్వాత రెండు, మూడు రోజుల్లో కౌన్సెలింగ్ పూర్తవడం, పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వడం అంతా కేవలం నాలుగైదు రోజుల్లో పూర్తయ్యాయి. ఇప్పుడు కేవలం 16,347 పోస్టులు మాత్రమే. కానీ ప్రచారం మాత్రం పీక్ స్టేజ్‌లో నిర్వహిస్తున్నారు.



రాజమహేంద్రవరంలో బస వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న ఎంపికైన అభ్యర్థులు

అన్నపూర్ణా దేవిగా మాణిక్యాంబ



రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో దసరా మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం మాణిక్యాంబ అమ్మవారి మట్టి ప్రతిమకు అన్నపూర్ణా దేవి అలంకరణ చేశారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అనంతరం అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

సీపీఓగా మురళీకృష్ణ బాధ్యతల స్వీకరణ



మురళీకృష్ణను అభినందిస్తున్న కలెక్టర్

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా ఆర్థిక గణాంక శాఖాధికారి కార్యాలయంలో సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న ఎం.మురళీకృష్ణ జిల్లా ఉప సంచాలకులు(సీపీఓ)గా పదోన్నతి పొందారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనను అభినందించి, సమర్థంగా విధులు నిర్వహించి, జిల్లాకు మంచి పేరు తేవాలని అభిలషించారు.

అరటి ఫైబర్ ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి

ఉద్యాన, పరిశ్రమల కేంద్రం అధికారులతో కలెక్టర్



అరటి నార ఆధారిత చేతివృత్తి ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: పర్యావరణ అనుకూల ఉత్పత్తుల తయారీలో భాగంగా అరటి ఫైబర్ యూనిట్లు స్థాపించి రైతుల జీవనోపాధి మెరుగుపర్చాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఉద్యాన, పరిశ్రమల కేంద్రం అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాజమహేంద్రవరంలో అరటి నార ఉత్పత్తుల తయారీ యూనిట్‌ను సందర్శించి, అరటినార ఆధారిత చేతివృత్తి ఉత్పత్తుల తయారీ ప్రక్రియను ఉద్యాన అధికారి బీవీ రమణతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టు గురించి ఉద్యాన అధికారి రమణ కలెక్టర్‌కు వివరించారు. రావులపాలెం మండలంలో అరటి నార సేకరిస్తున్నారని, దీంతో రాజమహేంద్రవరంలో చేతివృత్తి ఉత్పత్తుల తయారీ జరుగుతోందన్నారు. అరటి సాగవుతున్న రావులపాలెం ప్రాంతంలో అరటి నార ఉత్పత్తి ద్వారా రైతులకు అదనపు ఆదాయాన్ని పెంచడంతో పాటు, గ్రామీణ స్థాయిలో చిన్న కుటీర పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలను అరటి ఫైబర్ పరిశ్రమ సృష్టించగలదన్నారు. కోనసీమ జిల్లాలో సుమారు 24 వేల ఎకరాల్లో అరటి సాగు జరుగుతోందని చెప్పారు. ఒక్కో చెట్టుకు 200 గ్రాముల అరటి నార, పది కిలోల వ్యర్థాన్ని ఉత్పత్తి చేస్తాయని, దీని ద్వారా ఎకరానికి 160-200 కిలోల అరటి నార సేకరించవచ్చన్నారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం కిలో నార రూ.200 ఉండటంతో, రైతులకు ఎకరానికి రూ.32 వేల నుంచి రూ.40 వేల అదనపు ఆదాయం లభిస్తుందన్నారు.

సత్వర న్యాయం చేయాలి

అట్రాసిటీ కేసుల్లో బాధితుల రక్షణ, దోషులకు శిక్షలు, బాధితుల పునరావాసంతో పాటు, సత్వర న్యాయానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పౌర హక్కుల రక్షణ చట్టంపై జిల్లా స్థాయిలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. గత సమావేశ మినిట్స్‌పై తీసుకున్న చర్యలను జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి జ్యోతిలక్ష్మీదేవి సభ్యులకు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, బాధిత కుటుంబాలకు నష్ట పరిహారాలు అందించడంలో జిల్లా ఆరో స్థానంలో నిలిచిందన్నారు. వసతి గృహ బాలబాలికల ఆరోగ్య పరిరక్షణకు బేసిక్ ఎమర్జెన్సీకి ఐసీఐసీఐ లాంబార్డ్ గ్రూపు ఇన్సూరెన్స్‌ను సీఎస్సార్ ద్వారా ప్రవేశపెట్టినట్టు చెప్పారు. తద్వారా రూ.50 వేల బీమా పరిహారం అందుతుందన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా 44 యూనిట్లకు రూ.376 లక్షలు కేటాయించినట్టు చెప్పారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం చేసేందుకు ముందుగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, నిర్దేశిత సమయంలో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 25 కేసులుండగా, 19 కేసులకు ఎఫ్ఐఆర్ దశలో రూ.12 లక్షలు, చార్జిషీట్ దశలో ఆరు కేసులకు రూ.6 లక్షలు పరిహారాలుగా అందించారన్నారు. కమిటీ సభ్యులు పుణ్యమంతుల రజిని, డీఆర్ఓ కె.మాధవి, ఆర్డీవోలు పి.శ్రీకర్, దేవరకొండ అఖిల, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మంత్రి గారి ఆదేశాలు.. దివ్యాంగులకు అగచాట్లు

- నెల రోజులుగా ఎంఈఓ ఆఫీస్‌కు తాళం
- చిన్నారులకు వరండాలో ఫిజియోథెరపీ



తాళం వేసి ఉన్న రామచంద్రపురం ఎంఈఓ కార్యాలయం

రామచంద్రపురం రూరల్: మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాలతో నెల రోజులుగా రామచంద్రపురం ఎంఈఓ కార్యాలయం తాళాలు వేసి దర్శనమిస్తోంది. రెండంతస్తుల భవనంలో పైన ఎంఈఓ కార్యాలయం ఉండగా, కింద దివ్యాంగ విద్యార్థుల భవిత కేంద్రం ఉంది. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద మహిళలకు కుట్టు మెషీన్ల శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి సుభాష్ ఆదేశాల మేరకు ఎంఈఓ కార్యాలయంలో గత ఏప్రిల్‌లో ప్రారంభించారు. నెల రోజుల క్రితం శిక్షణ పూర్తయినా, కార్యాలయంలో కుట్టు మెషీన్లు ఉండిపోవడంతో మీటింగ్ హాల్‌ను ఇంకా ఎంఈఓకు అప్పగించలేదు. శిక్షణకు వచ్చే మహిళలకు మరుగుదొడ్లకు ఇబ్బంది అవుతుందని ఎంఈఓ ఆఫీసును కింద ఉన్న దివ్యాంగుల భవిత పాఠశాలలోకి మార్చేశారు. దీంతో దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీని ఆరుబయట వరండాలో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంత్రి తీరుతో దివ్యాంగ చిన్నారులు ఇబ్బందుల పాలవుతున్నారు. ఇప్పటికైనా మంత్రి తన తప్పును సరిదిద్దుకుని ఎంఈఓ కార్యాలయాన్ని పై అంతస్తులోకి తరలించాలని, భవిత కేంద్రాన్ని దివ్యాంగ చిన్నారులకు పూర్తి స్థాయిలో ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

'నన్నయ'లో ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక



ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ ఎంపికలో పాల్గొన్న విద్యార్థులు

రాజానగరం: ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా విద్యార్థులలో సేవా దృక్పథం, క్రమశిక్షణ, విలువలు, సమాజంపై అవగాహన వంటివి అలవడుతాయని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీలో వెస్ట్ జోన్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ సెలక్షన్స్ బుధవారం జరిగాయి. గోదావరి జిల్లాల నుంచి 190 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు హాజరై, తమ ప్రతిభను కనబరిచారు. ఎన్‌ఎస్‌ఎస్ రీజనల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ, ఈ క్యాంప్‌లో ప్రతిభ కనబరిచిన వలంటీర్లను ప్రీ ఆర్డీ క్యాంప్‌కి ఎంపిక చేస్తామన్నారు. ఇందుకు హైట్, రన్నింగ్ రేస్, మార్చ్‌ఫాస్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు, ఇతర టాలెంట్‌ను పరిశీలించడానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ సంజయ్, పీఓలు, పీఈటీలు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

ఆరోగ్య భాగస్వామి.. ఫార్మసిస్ట్

- తయారీ నుంచి మందులు పేషెంట్‌కు చేరే వరకు పూర్తి బాధ్యత
- కొత్తగా వచ్చే వ్యాధులను అడ్డుకోవడంలో కీలకపాత్ర
- 25న ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం



రాయవరం: రోగికీ, వైద్యునికీ మధ్య వారధిగా, ఆరోగ్య పరిరక్షణలో భాగస్వామిగా ఫార్మసిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారు. పూర్వం ఫిజీషియన్ స్వయంగా ఔషధాలను తయారు చేసేవారు. కాలక్రమంలో ఔషధ ఉత్పత్తి రంగం ప్రత్యేకంగా అభివృద్ధి చెందింది. నిపుణులైన ఔషధ ప్రయోక్తలే ఫార్మసిస్టుగా అవతరించారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆరోగ్య రక్షణ నిపుణుల సమూహంగా ఫార్మసిస్టులు ఉన్నారు. కమ్యూనిటీ ఫార్మసీ, హాస్పిటల్ ఫార్మసీ, ఫార్మసీ పరిశ్రమ, ఔషధ నియంత్రణ, పరిశోధన–అభివృద్ధి, బోధన వంటి పలు రంగాల్లో తమ సేవలు అందిస్తున్నారు.

ఫార్మసిస్ట్ డే ప్రాముఖ్యమిదీ..

1912 సెప్టెంబర్ 25న నెదర్లాండ్‌లోని హేగ్ నగరంలో ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్(ఐపీఎఫ్) ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా ఇదే తేదీన ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని నిర్వహిస్తునారు. ఈ ఏడాది థింక్ హెల్త్.. థింక్ ఫార్మాసిస్ట్ అనే నినాదంతో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

అతి పెద్ద రంగంగా..

కాలానుగుణంగా ప్రపంచంలో మందుల తయారీ అతి పెద్ద రంగంగా అవతరించింది. కొత్త రకం వైరస్‌లు అవతరిస్తూ.. కొత్త రోగాలు వస్తున్నాయి. వీటిని తట్టుకునేందుకు మందుల తయారీ సవాలుగా మారింది. ఎలాంటి రోగానికైనా మందును కనుగొనే ఫార్ములానైనా ఫార్మాసిస్టు తమ భుజాలపై వేసుకుని, ప్రపంచ జనాభాకు అనుగుణంగా, వివిధ ప్రాంతాల ప్రజల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకుని మందులు తయారు చేస్తున్నారు. మందుల తయారీ నుంచి పేషెంట్‌కు చేరే వరకు అన్ని విషయాల్లో ఫార్మసిస్ట్‌లదే కీలక పాత్ర.

ఫార్మసీ కోర్సులు చదివితే..

ఇంటర్ బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు మార్కుల ఆధారంగా ఫార్మసీ సీట్లు కేటాయిస్తారు. డిప్లొమా ఇన్ ఫార్మసీ చదివితే మెడికల్ షాపు పెట్టుకోవడానికి అర్హత వస్తుంది. ఆపై బీఫార్మసీ చేసిన వారు ల్యాబ్స్‌లో ఔషధాలకు సంబంధించి పని చేస్తారు. ఎం.ఫార్మసీ చేసిన వారు ఔషధ తయారీ సంస్థల్లో నూతన ఔషధాలు, కాంబినేషన్లు కనిపెట్టడం, పరిశోధించడం, క్వాలిటీ కంట్రోల్ వంటి విభాగాల్లో ఉంటారు. అలాగే డాక్టర్ ఆఫ్ ఫార్మసీ కోర్సులను కూడా చేయవచ్చు.

కోనసీమలో పరిస్థితి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో డైరెక్టర్ సెకండరీ హెల్త్ పరిధిలో ఇద్దరు చీఫ్ ఫార్మసీ ఆఫీసర్లు, తొమ్మిది మంది సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లు, 16 మంది ఫార్మసీ ఆఫీసర్లు ఉన్నారు. అలాగే జిల్లాలో మూడు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రులుండగా, ప్రతి ఏరియా ఆస్పత్రిలో చీఫ్ ఫార్మసీ ఆఫీసర్, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్, నలుగురు ఫార్మసీ పోస్టులు ఉంటాయి. తొమ్మిది సీహెచ్‌సీలుండగా, ప్రతి సీహెచ్‌సీలో సీనియర్ ఫార్మసీ, ఫార్మసీ ఆఫీసర్ ఉంటారు. అదేవిధంగా 46 పీహెచ్‌సీలు, ఏడు అర్బన్ హెల్త్ సెంటర్లలో ఫార్మసిస్ట్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఫార్మసిస్ట్ గ్రేడ్–2 ఫార్మసీ ఆఫీసర్‌గా మార్పు చేశారు.

వైద్యులతో సమానంగా సేవలు



ఫార్మసిస్టులకు మాత్రమే వైద్యులతో సమానంగా సేవలందించే అవకాశం ఉంటుంది. కరోనా విజృంభించిన సమయంలో నిరంతర సేవలు అందించాం. కరోనా బారిన పడినా, తిరిగి విధుల్లో చేరి పేషెంట్లకు అవసరమైన మందులు అందిస్తూ, వారు కోలుకునేందుకు చేసిన సేవలు వృత్తిపరంగా సంతృప్తినిచ్చాయి.

– ఎస్ వసంతరావు, ఫార్మసిస్ట్, ఏరియా ఆస్పత్రి, అమలాపురం

పూర్తి బాధ్యత ఫార్మసిస్ట్‌దే..



మందులు పేషెంట్‌కు చేరే వరకు పూర్తి బాధ్యత ఫార్మసిస్టులదే. మందుల స్టోరేజీ, బ్యాచ్ నంబర్, కాలం చెల్లే తేదీ, క్వాలిటీ వంటి విషయాల్లో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా పేషెంట్‌కు ప్రమాదం. గత 12 ఏళ్లుగా ఉద్యోగం చేసిన అన్ని ప్రాంతాల్లో సంతప్తికరమైన సేవలు అందించాను.

– సీహెచ్ పేరిందేవితాయారు, ఫార్మసిస్ట్, పీహెచ్‌సీ, రాయవరం

బస్సు నుంచి జారి పడి మహిళ మృతి

అల్లవరం: ఓడలరేవు నుంచి అమలాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి ఓ మహిళ మృతిచెందారు. మొగళ్లమూరు పంచాయతీ శిరగట్లపల్లి ప్రాంతానికి చెందిన నారగడ నరసమ్మ (55) ఈ ప్రమాదంలో మృతిచెందినట్టు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు, మొగళ్లమూరు సెంటర్‌లో ఆమె అమలాపురం వెళ్లే బస్సు ఎక్కింది. గోడిలంకలోని పెనుమాలపేట వరకు ఉచిత ప్రయాణ టికెట్ తీసుకుంది. పినమాలవారిపేట వచ్చేసరికి ఎక్కువ మంది ప్రయాణికులు ఉండడంతో బస్సు నుంచి దిగుతూ ఆమె అదుపు తప్పి జారిపడింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు ఆమెను 108లో అల్లవరం సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఆమె సోదరుడు నారగడ చంద్రరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. కాగా ఉచిత ప్రయాణం కల్పించినప్పటికీ, తగినన్ని బస్సులు , వసతులు ఇవ్వకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జనాలను చంపడానికా.. : మాజీ ఎంపీ అనురాధ

బస్సు నుంచి మహిళ జారి పడి మృతి చెందిన ఘటనపై మాజీ ఎంపీ చింతా అనురాధ స్పందించారు. ప్రయాణికులను చంపడానికే కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు ఏర్పాటు చేసినట్టు ఉందని విమర్శించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాద సమయంలో బస్సులో వందకు పైగా ప్రయాణికులున్నారని, ఫుట్‌బోర్డు ప్రయాణం చేసి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతురాలు నరసమ్మ కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రాణం మీదకు తెచ్చిన ప్రచార పిచ్చి

ఎమ్మెల్యే ఫ్లెక్సీ పడి మహిళకు తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో బాధితురాలు



ప్రమాదానికి కారణమైన ఫ్లెక్సీ

అనపర్తి: అధికార పార్టీ ప్రచార పిచ్చి ప్రయాణికులకు ప్రాణాంతకంగా మారింది. అనుమతులు లేకుండా ఊరంతా ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు ప్రయాణికుల పాలిట శాపంగా మారుతున్నాయి. బిక్కవోలు గ్రామానికి చెందిన గువ్వల విజయలక్ష్మి, వెంకటరెడ్డి దంపతులు బుధవారం మోటార్ సైకిల్‌పై అనపర్తిలోని కంటి ఆసుపత్రికి వెళుతున్నారు. అనపర్తి పోలీస్ స్టేషన్ సమీపంలో చిన్న వంతెన వద్ద స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరిట ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ ఆకస్మికంగా ఆ దంపతులపై కూలింది. దీంతో వారు కింద పడిపోగా, ఫ్లెక్సీ ఫ్రేమ్ ఊచలు విజయలక్ష్మి తలకు నాలుగు అంగుళాల మేర చీరుకుని తీవ్ర గాయమైంది. తీవ్ర రక్తస్రావం అవుతున్న ఆమెను స్థానిక కానిస్టేబుల్ ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఆమె భర్త హెల్మెట్ ధరించి ఉండడంతో స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన ఫ్లెక్సీని కర్రలకు కట్టకుండా జార వేయడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. బాధితురాలిని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి వస్తుందని, ఇందుకు కారణమైన ఎమ్మెల్యేపై కేసు పెట్టాల్సి వస్తుందని ఆమెను ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్టు తెలుస్తోంది. ఇంత జరిగినా టీడీపీ నాయకులు ఆ ఫ్లెక్సీని మళ్లీ అలాగే జారేయడం గమనార్హం.

కుప్పకూలిన పవన్ భారీ కటౌట్

జన సంచారం లేకపోవడంతో తప్పిన ముప్పు



కాకినాడ భానుగుడి సెంటర్‌లో కుప్పకూలిన పవన్‌కల్యాణ్ భారీ కటౌట్

కాకినాడ క్రైం: డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కల్యాణ్ అభిమానుల అత్యుత్సాహం ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. భారీ కటౌట్ కుప్పకూలగా.. అక్కడ జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. గురువారం 'ఓజీ' చిత్రం విడుదల సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, మరో జనసేన నేత నున్న దొరబాబు పేర్లతో నిత్యం రద్దీగా ఉండే భానుగుడి జంక్షన్‌లో 70 అడుగుల భారీ పవన్‌కల్యాణ్ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం మధ్యాహ్నం ఈ కటౌట్ కుప్పకూలింది. భారీ ఎత్తులో ఏర్పాటు చేయడం వల్ల బరువు తాళలేక ఆ కటౌట్‌ను నిలిపిన కర్రలు తునాతునకలయ్యాయి. కటౌట్ రోడ్డుపై కూలగా.. ఆ సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ పోలీసులు కటౌట్‌ను రోడ్డు మధ్య నుంచి అతికష్టంగా పక్కకు నెట్టారు. ఈ ఘటనతో ప్రయాణికుల్లో భయాందోళనలు వ్యక్తమయ్యాయి. బాధ్యతాయుత స్థానంలో ఉన్న పార్టీ లీడర్లు ప్రచార ఆర్భాటానికి దూరంగా ఉంటూ, ప్రజల సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని పలువురు అభిప్రాయపడ్డారు.

ఓడలరేవు తీరంలో బోటు దగ్ధం

రూ.పది లక్షలకు పైగా నష్టం



ఓడలరేవు తీరంలో దగ్ధమవుతున్న బోటు



ప్రమాదం తర్వాత బోటు దుస్థితి

అల్లవరం: ఓడలరేవు వైనతేయ నదీ తీరం జెట్టీ వద్ద మరమ్మతులు నిర్వహిస్తున్న బోటు మంగళవారం అర్ధరాత్రి దగ్ధమైంది. ఈ ఘటనలో రూ.10 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. మండలంలోని కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన కొపనాతి శంకరానికి చెందిన బోటుకు రెండు నెలలుగా మరమ్మతులు చేస్తున్నారు. రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తయి.. చేపల వేటకు సిద్ధమవుతున్న తరుణంలో మత్స్యకార బోటు అగ్ని ప్రమాదానికి గురైంది. కాలిపోతున్న బోటుని కాపాడేందుకు స్థానికులు ఓడలరేవు ఓఎన్‌జీసీకి చెందిన ఫైరింజిన్ విభాగానికి సమాచారమిచ్చారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయం అంతు చిక్కడం లేదు. అర్ధరాత్రి బోటు అగ్ని ప్రమాదానికి గురికావడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇదే బోటు యజమానికి చెందిన మరో బోటు వైనతేయ నదిలో లంగరు వేసి ఉన్న సమయంలో అగ్ని ప్రమాదానికి గురైంది. బోటుకు ఎవరైనా నిప్పు పెట్టారా లేక యాదృచ్ఛికంగా జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై బోటు యజమాని శంకరం అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జయలక్ష్మి సొసైటీకి కొత్త బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో పాల్గొన్న సొసైటీ బాధితులైన విశ్రాంత ఉద్యోగులు

బాధితుల సమావేశం డిమాండ్

అమలాపురం టౌన్: అనేక మంది విశ్రాంత ఉద్యోగులు జయలక్ష్మి కో–ఆపరేటివ్ సొసైటీ మోసాలకు బలవ్వగా, నేటికీ న్యాయం జరగలేదని కోనసీమ ప్రాంతానికి చెందిన ఆ సొసైటీ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురంలోని ఏఎస్‌ఎన్ కళాశాలలో విశ్రాంత తహసీల్దార్ భాస్కర వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం జయలక్ష్మి సొసైటీ బాధితుల సమావేశం జరిగింది. ప్రస్తుత సొసైటీ బోర్డు పూర్తి రాజీనామా చేసి, దాని స్థానంలో కొత్త బోర్డును ఏర్పాటు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది రాజమహేంద్రవరం సీఐడీ కోర్టులో జయలక్ష్మికి చెందిన నలుగురు మేనేజర్లపై అవినీతి కేసులు నమోదైనా, ప్రస్తుత బోర్డు వారిపై ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్పష్టం చేసింది. మొత్తం 2,450 మంది ఈ సొసైటీలో రుణాలు తీసుకుని, తిరిగి చెల్లించలేదని పేర్కొంది. ఇందులో కేవలం 13 మంది మాత్రమే ట్రిబ్యునల్‌లో కేసులు పెట్టారని గుర్తు చేసింది. రుణాలు తిరిగి చెల్లించని వారి నుంచి స్వాధీనం చేసుకున్న ఆస్తుల నుంచి ఏ విధమైన ఆదాయం రాకుండా, వాటికి తాళాలు వేసి అలాగే వదిలేశారని విజయవాడకు చెందిన టీవీడీఎస్ ప్రసాదరావు తెలిపారు. అన్నింటా విఫలమైన ప్రస్తుత బోర్డు సభ్యులు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అమలాపురానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు భాస్కర్ మీనన్ మాట్లాడుతూ, అమలాపురం సొసైటీ బ్రాంచి నుంచి రుణాలు తీసుకున్న వారంతా తిరిగి చెల్లించినా, మిగిలిన బ్రాంచీల్లో రుణాలు తీసుకున్న వ్యక్తులు ఎగ్గొట్టడం వల్లే ఇక్కడి సభ్యులైన బాధితులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీ బాధితులు, విశ్రాంత ఉద్యోగుల గుళ్లపల్లి వెంకట్రామ్, వేదనభట్ల కళా పూర్ణారావు, జి.కృష్ణారావు, తురగా చిన్న, ఇళ్ల నరసింహారావు, పుత్సా కృష్ణ కామేశ్వర్, రెహమాన్, రాజ్‌కుమార్, మావుళ్లయ్య, అర్జునుడు, నాగ అన్నపూర్ణ తదితరులు మాట్లాడారు.

కాకినాడలో 5న డైరెక్టర్ పదవులకు ఎన్నిక

కాకినాడ రూరల్: స్థానిక ది జయలక్ష్మి కోఆపరేటివ్ మాక్ సొసైటీలో ఖాళీ అయిన రెండు డైరెక్టర్ పదవులకు అక్టోబర్ 5వ తేదీన ఎన్నిక నిర్వహించనున్నట్టు ఎన్నికల ఆఫీసర్ కంబాల శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ ప్రకారం 5వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాకినాడ పేర్రాజుపేట, మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లో ఎన్నిక నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ రెండు డైరెక్టర్ పదవులకు ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటల నుంచి స్థానిక సర్పవరం జంక్షన్‌లోని సొసైటీ హెడ్ ఆఫీస్‌లో నామినేషన్లు తీసుకోవాలని ఎన్నికల అధికారి తెలిపారు.

సత్యదేవుని సన్నిధిలో రీల్స్ షూటింగ్

- పవిత్ర నక్షత్ర వనంలో నృత్యాలు
- మండిపడుతున్న భక్తులు



సత్యగిరిపై నక్షత్ర వనం లోపల రీల్స్ చేస్తున్న వ్యక్తులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానాన్ని రెండు యువ జంటలు బుధవారం తమ రీల్స్ షూట్‌కు వేదికగా చేసుకున్నాయి. ఓవైపు దసరా నవరాత్రుల సందర్భంగా దేవస్థానంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఈ తరుణంలో ఇలా సినిమా పాటలకు స్టెప్పు లేయడం, వాటిని సోషల్ మీడియాలో పోస్టులు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం దేవస్థానంలోని సత్యగిరిపై ఘాట్ రోడ్, నక్షత్ర వనంలో నాగార్జున, దుర్గ, లోవరాజు లక్ష్మి సినిమా పాటలకు స్టెప్పులేశారు. తర్వాత ఆ రీల్స్‌ను సంక్రాంతి పేరుతో, డ్రైవర్ రాజు అనే పేరుతో ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. దేవస్థానం 27 నక్షత్రాల పేరుతో పవిత్రమైన వృక్షాలను పెంచుతున్న నక్షత్ర వనం లోపలకు వెళ్లి మరీ స్టెప్పులేయడంపై భక్తులు మండిపడుతున్నారు. వందల సంఖ్యలో సెక్యూరిటీ సిబ్బంది దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్నా వీరు దర్జాగా రీల్స్ షూట్ చేయడంతో అంతా అవాక్కయ్యారు. దేవస్థానంలో సెక్యూరిటీ వైఫల్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటువంటి సంఘటనలు జరగకుండా దేవస్థానం అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

దేవస్థానం ఉద్యోగి ఆత్మహత్యా యత్నం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని ఈఓ పేషీలో పనిచేస్తున్న ఉద్యోగి బీఎస్ఎన్ రాజు ఫ్లోర్ క్లీనర్ తాగి మంగళవారం రాత్రి ఆత్మహత్యాయత్నం చేశారు. అతని కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిచడంతో ప్రాణాపాయం తప్పింది. ఈఓ పేషీలో పనిచేస్తున్న రాజును ఈఈ వీర్ల సుబ్బారావు అందరి ముందు దుర్భాషలాడడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేశాడనే ప్రచారం జరుగుతోంది. దీనిపై ఈఈను వివరణ కోరగా, తాను అతనిని దుర్భాషలాడలేదని చెప్పారు. అతడి ప్రవర్తన బాగోకపోవడంతో మందలించానన్నారు.

షట్టర్ వంచి.. ఆపై అద్దాన్ని పగులగొట్టి..

- నగల దుకాణంలో 11 కిలోల వెండి చోరీ
- ఆభరణాల విలువ రూ.2 లక్షలు




సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

ప్రత్తిపాడు రూరల్: దుకాణం షట్టర్‌ను పైకి వంచి.. దానిని ఆనుకుని ఉన్న అద్దాలను పగులగొట్టిన దొంగలు నగల దుకాణాన్ని కొల్లగొట్టిన ఉదంతమిది. పోలీసుల వివరాల మేరకు, స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ సమీపంలో సురేష్ జ్యూయలర్స్ అండ్ బ్యాంకర్స్‌లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆరుగురు దొంగలు దుకాణం వద్దకు చేరుకుని, షట్టర్ కింది భాగాన్ని ఇనుప రాడ్లతో పైకి వంచి, షట్టర్‌కు ఆనుకుని ఉన్న అద్దాలను పగులగొట్టారు. దాని ద్వారా లోనికి ప్రవేశించిన నలుగురు దుకాణంలో ఉన్న రూ.2 లక్షలు విలువైన 11 కిలోల వెండి ఆభరణాలను దొంగిలించారు. దుకాణంలోని లాకర్‌ను తెరిచేందుకు వారు విఫలయత్నం చేశారు. అది తెరుచుకోకపోవడంలో చేతికందిన వెండి ఆభరణాలను తస్కరించారు. లాకర్‌లో బంగారు వస్తువులు ఉన్నాయి. ఆయా ఘటనల దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్సైలు ఎస్ లక్ష్మీకాంతం, శ్రీహరిరాజు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దొంగలు ఫారెస్టు చెక్ పోస్ట్ వైపు కాలినడకన వెళ్లినట్టు సీసీ కెమెరా ఫుటేజ్ ద్వారా గుర్తించినట్టు తెలిసింది. గ్రామంలోని దుర్గమ్మ గుడి వీధిలో మోటార్ బైక్ మంగళవారం రాత్రి చోరీకి గురైంది. ఈ మేరకు బాధితుడు గుడివాడ వెంకటసత్య రవి ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పలువురు పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో పార్టీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఉన్నారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన పార్టీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు.



ముగిసిన 11 జిల్లాల టీఓటీల శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఫ్యాకల్టీలు

సామర్లకోట: పేదరిక నిర్మూలనకు గ్రామ స్థాయిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అమలు చేయాలని సీనియర్ ఫ్యాకల్టీలు డి.శ్రీనివాసరావు, ఎస్ఎస్ శర్మ అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు వరకు ఉత్సాహవంతులైన పంచాయతీ కార్యదర్శులను టీఓటీలుగా ఎంపిక చేసి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మూడు రోజుల పాటు నిర్వహించిన ఆరో బ్యాచ్ శిక్షణ బుధవారంతో ముగిసింది. మొత్తం 300 మంది టీఓటీలకు శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో ఆకలి బాధలను నిర్మూలించడం , ఆరోగ్య సంరక్షణ, జీవన ప్రమాణాల పెంపు, అందరికీ తాగునీటి వసతి కల్పించడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, ఉపాధి–ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు ఫ్యాకల్టీలు వివరించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై మండల పరిధిలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీలు జగన్నాథరావు, రామకృష్ణ, కె.శేషుబాబు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.